క్లుప్తంగా

తిరుపతి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

• ప్రయాణికుల విజ్ఞప్తి

పొదలకూరు: ఆత్మకూరు డిపోకు చెందిన తిరుపతి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల ఈ సర్వీసును రద్దు చేయడంతో అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, రోగులు పొదలకూరు నుంచి నేరుగా తిరుపతికి వెళ్లాలంటే బస్సులు మారాల్సి వస్తోంది. అయితే రాపూరు డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు పొదలకూరులో ఉదయం 7.30 గంటలకు ఉన్నా ఆర్డినరీ సర్వీసు కావడంతో ప్రయాణికులు విముఖత చూపుతున్నారు. ఉదయం 8.30 గంటలకు ఆత్మకూరు డిపో నుంచి వయా సంగం, పొదలకూరు మీదుగా రాపూరు, వెంకటగిరి, తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను ఇటీవల రద్దు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు ప్రయాణికులు తెలిపారు. రాపూరు బస్సు సర్వీసు స్థానంలో ఎక్స్‌ప్రెస్‌నైనా నడపాల్సిందిగా కోరుతున్నారు. ఆర్టీసీ అధికారులు పునరాలోచించి పొదలకూరు మీదుగా తిరుపతికి ఎక్స్‌ప్రెస్ సర్వీసును నడపాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం



ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో పుష్కర మహా కుంభాభిషేకం నేటి నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతుందని ఆలయ ఈఓ తాతా శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ మేరకు ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

రోడ్డు మంజూరైనా వేయడం లేదు



మాట్లాడుతున్న గ్రామస్తులు

కోవూరు: మా ప్రాంతంలో సిమెంట్ రోడ్డు మంజూరైనా వేయడం లేదని మండలంలోని పాటూరు గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు గ్రామంలోని దళితవాడలో వారు గురువారం మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద రోడ్డు మంజూరైందని, అయితే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని దళితవాడకు రోడ్డు వేయాలని కోరారు.

మైనార్టీ నేతకు పరామర్శ



బుచ్చిరెడ్డిపాళెం: తీవ్ర అస్వస్థతకు గురై నెల్లూరు కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బుచ్చి వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత డాక్టర్ అల్లాభక్షును మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పరామర్శించారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

మనుబోలు: మండలంలోని మనుబోలు, జట్ల కొండూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం విశేష పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణలు బాబా విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించి పుష్పాలంకరణ చేశారు. మనుబోలులో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

• పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

• బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని సాయి మందిరంలో పల్లకిసేవను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శశిధర్‌రెడ్డి – నిషితారెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో విశేష పూజలు

విడవలూరు: మండలంలోని దండిగుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయంలో స్వామివారికి కుంభాభిషేకం, విశేష పూజా కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లంకొండ శ్రీధర్, రావెళ్ల మల్లికార్జున, అనపల్లి ఉదయ్‌భాస్కర్, బెల్లకొండ సుప్రజ, భక్తవత్సలం, చినమస్తానయ్య, హరిబాబు, శీనయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

బాబోయ్ దోమలు

• మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త
• పూడికతీత పనులు పెద్ద మిథ్యే
• దోమలకు ఆవాసంగా బుచ్చిరెడ్డిపాళెం

గుడపల్లి కాలువ డ్రెయినేజీ ఇలా..



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగరంలో దోమలు దండయాత్ర ప్రజలు కంటి మీద కునుకులేకుండా చేస్తోంది. గత నెలలో రూ.28 లక్షల వ్యయంతో మురుగు కాలువల పూడికతీత పనులు చేపట్టారు. అయితే కాలువల్లోని నీరు మాత్రం నిల్వ ఉండడంతో దోమల ఉధృతి తీవ్రంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

అలంకార ప్రాయంగా ఫాగింగ్ యంత్రాలు

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సమక్షంలో అట్టహాసంగా మూడు ఫాగింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అయితే చెన్నూరు రోడ్డు, ముంబై రోడ్డుకు మాత్రమే ఫాగింగ్ మెషీన్లు పరిమితమై మిగిలిన పట్టణాన్ని గాలికొదిలేశారు. దీంతో బుచ్చి పట్టణం దోమలమయంగా మారింది. ఉదాహరణగా గుడపల్లి కాలువ పూడికతీత పనులను రూ.4.80 లక్షల వ్యయంతో తూతూ మంత్రంగా పూర్తి చేసి బిల్లులు సైతం చెల్లించారు. అయితే కాలువల్లో నీరు మాత్రం బయటకు వెళ్లకుండా అక్కడే నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసంగా మారింది.

పట్టణాన్ని గాలికొదిలేశారు

మండలంలోని చిన్న పంచాయతీల్లో ఉన్న డ్రెయినేజీల్లో దోమల నివారణ కోసం పిచికారీ చేయడం, పారిశుద్ధ్యాన్ని దగ్గరుండి ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు. కానీ బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో మాత్రం అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ప్రవర్తించడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా 1, 15వ వార్డుల్లోని ప్రజలు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రాలు కూడా ఇచ్చారు. అయితే అధికారులు మాత్రం పనులు చేశాం, మాకేంటి సంబంధం అనేతీరులో వ్యవహరించడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.





చెత్తతో నిండిపోయిన కాలువలు



అధ్వానంగా మురుగు కాలువ

నరకయాతన పడుతున్నాం



నగర పంచాయతీ పరిధిలో ప్రస్తుతం మూడు ఫాగింగ్ మెషీన్లు ఉన్నా కేవలం మెయిన్ రోడ్లుకు మాత్రమే పరిమితమయ్యాయి. వీధుల్లో ఫాగింగ్ చేయకపోవడం వల్ల దోమలు విజృంభించి నరకయాతన పడుతున్నాం.

– సీహెచ్ మల్లికార్జునరావు, సీపీఎం నేత

ఉండలేకున్నాం



ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ఇంటా బయటా ఎక్కడా ఉండలేకున్నాం. కాలువల మరమ్మతులు నాసిరకంగా చేయడం వల్ల దోమల ఉత్పత్తికి దోహదపడింది. అధికారులు బాధ్యత వహించి దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– విల్సన్, బుచ్చిరెడ్డిపాళెం పట్టణం

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. మహిళా భక్తులకు నిర్వాహకులు స్వామి, అమ్మవార్ల ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అనంతరం అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ బాధ్యులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, చొప్పా వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, సన్నికంటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు: పట్టణంలోని తొగటవీధి, పద్మావతినగర్, వినాయకమాన్యం, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

మహాత్మా గాంధీ జీవితం యువతకు ఆదర్శం



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీలో..

• వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: జాతిపిత మహాత్మా గాంధీ జీవితం యువతకు ఆదర్శమని విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో గురువారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అహింస, సత్యాగ్రహాలే ఆయుధాలుగా దేశానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అందించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.

• పొదలకూరు: స్థానిక శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య నాయకులు గురువారం జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు సేవా సమితి అధ్యక్షుడు, ఆర్యవైశ్య నాయకుడు ఆదూరు వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఆకులూరు హేమంత్, మధు, నున్నా మల్లి, సుధీర్, చంద్ర, నారాయణ, నాగసూరి, సుజీవన్, కోదండయ్య, మణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

• మండలంలోని ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయులు, ఆరోగ్య శాఖ అధికారులు గాంధీ వర్ధంతిని నిర్వహించారు. డాక్టర్ రిషిత కిరణ్, మోహన్‌రావు, రవికుమార్, టీచర్ బి.పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కోవూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్ముని చిత్రపటానికి నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ అధికారి డాక్టర్ ఎ.మహేంధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీప్రసూన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు.

• విడవలూరు: స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ వర్ధంతిని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చక్రపాణి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హిస్టరీ అధ్యాపకుడు వెంకటరమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

• ఇందుకూరుపేట: పల్లిపాడులోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డి, ఆశ్రమ కన్వీనర్ గణేశం కల్పనమ్మ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి జరిగింది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి హాజరై గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఆశ్రమ సభ్యులు పాల్గొన్నారు.



విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



పొదలకూరు: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



పొదలకూరు: జెడ్పీ హైస్కూల్లో..

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో సెక్టార్ మీటింగ్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన రికార్డులను అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల గ్రోత్, గర్భిణులు, బాలింతలు, సర్వే, బాలామృతం, ఎఫ్‌సీఆర్‌లకు సంబంధించిన అన్ని రికార్డులను పంపిణీ చేశామని, వీటి నిర్వహణలో లోపాలుంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులను చూపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

డీపీఓ పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం: మండల పరిధిలోని మేజర్ పంచాయతీ రేబాల గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను డీపీఓ ఎల్.శ్రీధర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది, కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కోవూరు టీడీపీలో కొత్త కోటరీ

• కార్యక్రమాల్లో కనిపించని సీనియర్లు
• మండలాల్లో ఇన్‌చార్జిలదే పెత్తనం

కోవూరు: కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే కొత్త కోటరీదే పెత్తనంగా మారింది. టీడీపీ ఆవిర్భావం నుంచి జెండా మోసిన సీనియర్ నేతలకు పొగబెట్టి దూరం పెట్టారు. ఎమ్మెల్యేతో బంధుత్వం ఉన్న నేతలను మండలాలకు ఇన్‌చార్జిలుగా నియమించి పెత్తనం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నిర్వహించే కార్యక్రమాల్లో టీడీపీకి చెందిన సీనియర్లు ఎవరూ ఆ ఛాయల్లో కనిపించడం లేదు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పార్టీ అధినేత చంద్రబాబుకు కూడా అత్యంత సన్నిహితుడు. ఇప్పుడు ఆయనతోపాటు ఆయన వర్గాన్ని కూడా దూరం పెట్టేశారు.

➡ మరో సీనియర్ నేత పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి సైతం టీడీపీ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించడం లేదు. పెళ్లకూరు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. కోవూరు మండలంలో ఎమ్మెల్యేకు బంధువైన జెట్టి రంగారెడ్డి పెత్తనం చేస్తుండడం గమనార్హం.

➡ కొడవలూరు మండలంలో పార్టీకి కీలక నేతగా వ్యవహరించిన కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి సొంత నిధులు ఖర్చు పెట్టుకుని పార్టీ ఉన్నతికి పాటుపడ్డాడు. ఇప్పుడు ఆ మండలంలో ఆయన ఊసే లేదు. పార్టీ నిర్వహించే ఏ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొనడం లేదు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ అరాచకాలపై ఆందోళన తర్వాత ఆ పార్టీ నేతలు నిర్వహించిన మీడియా సమావేశానికి కూడా ఆయన హాజరు కాలేదంటే పార్టీలో ఆయన పరిస్థితికి అద్దం పడుతోంది. ఇందుకూరుపేట మండలానికి చెందిన కోడూరు కమలాకర్‌రెడ్డి కొడవలూరుకు వచ్చిన మీడియా సమావేశం నిర్వహించడం విశేషం.

➡ ఇందుకూరుపేట మండలంలో టీడీపీకి కష్టకాలంలో అండగా ఉన్న వీరేంద్ర సైతం ఇప్పుడు కరివేపాకు అయ్యారు. ఆ మండలంలో ఎమ్మెల్యేకు దూరపు చుట్టరికంతోపాటు చిరకాల పరిచయం ఉన్న కమలాకర్‌రెడ్డిదే ఆధిపత్యంగా ఉంది.

పార్టీ ఫిరాయింపు నేతలకు చుక్కెదురు

ఎన్నికల సమయంలో అధికారం దక్కించుకునేందుకు వైఎస్సార్‌సీపీ నుంచి పార్టీలోకి చేర్చుకున్న వారిని ఇప్పుడు కరివేపాకులా తీసి పారేశారని తెలుస్తోంది. బుచ్చిరెడ్డిపాళెంలో కీలక నేతలుగా ఉన్న యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సురా శ్రీనివాసులురెడ్డితో పాటు పోలంరెడ్డి వర్గాన్ని దూరం పెట్టినట్లు తెలుస్తోంది. ఈ జాబితాలో విడవలూరు మండలానికి చెందిన ఊటుకూరు విజయభానురెడ్డి పరిస్థితి అంతేగా ఉంది. ఈ మండలంలో ఎమ్మెల్యే కుటుంబానికి బంధువైన శ్రీహరిరెడ్డి పెత్తనం సాగిస్తుండటం విశేషం.

అరువు నేతలే దిక్కు

నియోజకవర్గంలో కార్పొరేట్ పరిపాలన సాగుతోంది. ప్రతి గ్రామంలో ఒక వర్గానికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆ పార్టీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలే ఇందుకు అద్దం పడుతున్నాయి. ఏ మండలంలోనైనా పార్టీ కార్యక్రమం నిర్వహించాలన్నా.. ఎమ్మెల్యే వెంట పక్క నియోజకవర్గంతోపాటు మండలాల కోటరీ నేతలే మందీమార్బలంగా తరలి వస్తుండటం విశేషం. ప్రెస్‌మీట్లు పెట్టాలన్నా.. ఎమ్మెల్యే కోటరీలోని నేతలే వచ్చిన మాట్లాడటం గమనార్హం.

పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి



మనుబోలు: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఏడీ



టీపీగూడూరు: కొత్తపట్టపుపాలెంలో..



కోవూరు: లేగుంటపాడులో..

తోటపల్లిగూడూరు: అత్యంత లాభదాయమైన పాడి పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని పశుసంవర్థక శాఖ డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కోడూరు పంచాయతీ కొత్తపట్టపుపాళెం గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరంజ జరిగింది. 118 లేగదూడలు, 87 పెద్ద పశువులకు డీవార్మింగ్ మందులను పంపిణీ చేశారు. అలాగే 34 పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, మరో 62 పశువులకు సాధారణ వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆ శాఖ నెల్లూరు డివిజన్ డీడీ డాక్టర్ నాగమణి, ఇందుకూరుపేట ఏడీఏ డాక్టర్ మురళీకృష్ణ, కోడూరు పశువైద్యాధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

• మనుబోలు: మండలంలోని మనుబోలు, ముద్దమూడి గ్రామాల్లో గురువారం పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మనుబోలు పశు వైద్యశాల ఏడీ డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ పశువులు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును తాగిస్తున్నట్లు తెలిపారు. ముద్దమూడి పశు ఆరోగ్య శిబిరంలో వీరంపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ షరీఫ్ పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

• కోవూరు: మండలంలోని లేగుంటపాడులో గురువారం పశువైద్య శిబిరం జరిగింది. పశు వైద్యురాలు డాక్టర్ ప్రీతి సల్మన్ ఆధ్వర్యంలో ఆరు గేదెలకు గర్భకోశ పరీక్షలు, 150 గేదెలకు నట్టల నివారణ మందు, 46 దూడలకు నులి పురుగుల నివారణ మందు, 105 గొర్రెలకు నట్టల నివారణ మందు అందించారు.

కుష్టు వ్యాధిపై గ్రామాల్లో అవగాహన



పొదలకూరు: ప్రతిజ్ఞ చేయిస్తున్న సిబ్బంది



వెంకటాచలం: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



కొడవలూరు: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

పొదలకూరు: కుష్టు వ్యాధిపై విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని పొదలకూరు కో – లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రిషిత కిరణ్ పేర్కొన్నారు. మండలంలోని ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్లో గురువారం కుష్టుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిలో రెండు పర్యాయాలు ఎల్‌సీడీసీ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ మోహన్‌రావు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.పెంచలరెడ్డి, ఉపాధ్యాయులు, ఆరోగ్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

• వెంకటాచలం: మండల కేంద్రమైన వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎర్రగుంట వద్దనున్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. వీటిల్లో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అలీ, రూరల్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ విద్యాసాగర్, కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక, గురుకులం ప్రిన్సిపల్ పరమేశ్వరరావు, నారాయణ నర్సింగ్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• కొడవలూరు : కుష్టు రహిత సమాజం కోసం కృషి చేద్దామని యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి కామాక్షయ్య కోరారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మండలంలోని యల్లాయపాళెం పంచాయతీ కార్యాలయంలో గురువారం కుష్టుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే నిర్లక్ష్యం చేయొద్దని, వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. హెచ్ఈఓ కోటేష్, ఏఎన్‌ఎం సుకన్య, వార్డు సభ్యుడు రియాజ్ పాల్గొన్నారు.

సరైన సమయానికి రాకపోవడంతో..

• బస్టాండ్‌లో ఆటోల దూకుడు
• అధికారులు స్పందించాలంటున్న జనం



ఆటో ఎక్కుతున్న ప్రయాణికులు

పొదలకూరు: బస్సులు సకాలంలో రాకపోవడంతో ప్రమాదమని తెలిసినా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. సాధారణంగా బుధ, గురు, శని వారాల్లో బస్టాండ్‌లో రద్దీ అధికంగా ఉంటుంది. ప్రయాణికుల రద్దీకి తగిన విధంగా ఆర్టీసీ బస్సులు పంచాయతీ బస్టాండ్‌కు రావడం లేదు. దీంతో ఆటో డ్రైవర్లు బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకెళ్తున్నారు. ఆర్టీసీకి సంబంధించిన లోడర్ పోస్టు ఇక్కడ లేకపోవడంతో ఆటోలు విచ్చలవిడిగా లోపలికి వస్తున్నాయి. దీంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ పడిపోతున్నట్టు తెలుస్తోంది. దీనికితోడు బస్సులు నాలుగైదు ఒకే సమయంలో రావడం, లేదంటే ఒక్కటి కూడా బస్టాండ్‌కు రాకపోవడం వల్ల ప్రయాణికులు విసిగిపోయి ఆటోల్లో నెల్లూరుకు చేరుకుంటున్నారు. ఎంతోకాలంగా ఈ పరిస్థితి కొనసాగుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.